గవర్నర్ పోటీ భేటీ!

● 25,26 తేదీల్లో ఊటీలో వీసీలతో సదస్సు

● ఉప రాష్ట్రపతికీ ఆహ్వానం



గవర్నర్ ఆర్.ఎన్.రవి

టి.నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ముఖ్యమంత్రి స్టాలిన్ ఛాన్సలర్ హోదాలో రాష్ట్రంలోని యూనివర్శిటీల వీసీలతో భేటీ అయిన నేపథ్యంలో ఆయనకు పోటీగా గవర్నర్ కూడా వీసీలతో మరో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 25, 26 తేదీల్లో ఊటీలో సమావేశం నిర్వహించాలని నిర్ణయించిన గవర్నర్.. ఈ సదస్సుకు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌ను ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా గవర్నర్ ప్రతియేటా ఊటీలో వీసీల సమావేశాన్ని ఏర్పాటు చేయటం ఆనవాయితీగా వస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 48 విశ్వవిద్యాలయాల, ప్రైవేటు విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు పాల్గొనేవారు. ఇదిలా ఉండగా శాసనసభలో ఆమోదించిన పది బిల్లులను గవర్నర్ రవి బుట్టదాఖలు చేయడాన్ని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం శాసనసభలో ఆమోదించి పంపిన 10 బిల్లులను గవర్నర్ రవి ఆమోదించకపోవడాన్ని, తానే ఆమోదించేందుకు వీలున్న బిల్లులను సైతం దురుద్దేశపూర్వకంగా రాష్ట్రపతి ఆమోదానికి పంపడాన్ని తప్పు పడుతూ తనకున్న విచక్షణాధికారంతో ఆ పది బిల్లులు ఆమోదం పొందినట్లు తీర్పునిచ్చింది. సుప్రీం కోర్టు ఆమోదం తెలిపిన బిల్లులలో విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ పదవి నుండి గవర్నర్‌ను తొలగించి ఆ బాధ్యతలను ముఖ్యమంత్రికి అప్పగిస్తూ శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించిన అత్యంత కీలకమైన బిల్లు కూడా ఉంది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఆ 10 బిల్లులు చట్టాలుగా మారినట్లు ప్రభుత్వ గెజిటల్‌లో ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 16న ముఖ్యమంత్రి స్టాలిన్ ఛాన్సలర్ హోదాలో వైస్‌ఛాన్సలర్లు, రిజిస్ట్రార్‌ల సమావేశాన్ని కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ముఖ్యమంత్రికి వైస్ ఛాన్సలర్లను నియమించే అధికారం మాత్రమే వచ్చిందని, విశ్వవిద్యాలయాలకు రాష్ట్ర గవర్నరే ఛాన్సలర్‌గా కొనసాగుతున్నారని, ఆ మేరకే ఈ నెల 25, 26 తేదీల్లో ఊటీలో వీసీల సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు రాజ్‌భవన్ వర్గాలు పేర్కొన్నాయి. ఆ సదస్సులో ప్రత్యేక అతిథిగా ఉప రాష్ట్రపతి పాల్గొంటారని కూడా కూడా ప్రకటించారు. ఈ సమావేశానికి హాజరుకావాలంటూ రాష్ట్రంలోని 48 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్సలర్లను ఆహ్వానించారు. గవర్నర్ ఆర్‌ఎన్ రవి వైస్‌ఛాన్సలర్ల సమావేశం నిర్వహించనుండటంతో ప్రస్తుతం ఆయన ఇంకా విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా కొనసాగుతున్నారా? లేక సుప్రీంకోర్టు ఉత్తర్వు ప్రకారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఛాన్సలర్ పదవీ బాధ్యతలు అధికారికంగా స్వీకరించలేదా? అనే అనుమానాలతో వీసీల్లో అయోమయం నెలకొంది. ఇటీవలే ఛాన్సలర్‌హోదా స్టాలిన్ పిలుపుమేరకు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి వీసీలందరూ హాజరయ్యారు. ఆ సమావేశం జరిగి పది రోజులు కూడా గడవక ముందే ముఖ్యమంత్రి స్టాలిన్‌తో ప్రత్యక్షంగా పోటీ పడేవిధంగా రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి వీసీల సమావేశం ఏర్పాటు చేయడం ప్రస్తుతం అన్ని వర్గాలలో చర్చనీయాంశంగా మారింది.

వీసీలు బహిష్కరించాలి...

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ముఖ్యమంత్రి ఛాన్సలర్‌గా ఇటీవలే వీసీల సమావేశం నిర్వహించారని, ఈ పరిస్థితులలో గవర్నర్ రవి తానే ఛాన్సలర్ అంటూ ఊటీలో వీసీల సమావేశం ఏర్పాటు చేయడం గర్హనీయమని సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కె.ముత్తరసన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన జారీ చేస్తూ గవర్నర్ ఏర్పాటు చేస్తున్న సమావేశాన్ని వీసీలు బహిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విధంగా టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై ఓ ప్రకటనలో గవర్నర్ రవి వీసీల సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి నిరసనగా ధర్నా జరుపుతామని, గవర్నర్ ఊటీ రాక సందర్భంగా నల్లజెండాలతో నిరసన ప్రదర్శనలు చేస్తామని హెచ్చరించారు.

'నీట్'పై ఈపీఎస్, స్టాలిన్ వాగ్వాదం

● పరస్పర ఆరోపణలతో వేడెక్కిన అసెంబ్లీ

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల సందర్భంగా నీట్ రద్దు చేస్తామంటూ బూటకపు వాగ్దానం చేసి ప్రజలను మోసగించిన డీఎంకే అధికారంలోకి వచ్చిందని ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే సభాపక్షనాయకుడు ఎడప్పాడి పళనిస్వామి(ఈపీఎస్) అసెంబ్లీలో తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అయితే పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు నీట్ రద్దుపై ఈపీఎస్ ఎందుకు మాట్లాడలేదో సభకు తెలపాలని ముఖ్యమంత్రి స్టాలిన్ నిలదీశారు.

బీజేపీతో పొత్తు అంటే ఎందుకు భయం

అసెంబ్లీ సమావేశం అనంతరం ఈపీఎస్ సచివాలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీతో అన్నాడీఎంకే పొత్తుపెట్టుకున్నప్పటి నుండి ముఖ్యమంత్రి స్టాలిన్ భయంతో వణకిపోతున్నారని విమర్శించారు. బీజేపీతో డీఎంకే పొత్తుపెట్టుకున్నప్పుడు తీపిగా ఉన్నట్లు, అన్నాడీఎంకే పొత్తుపెట్టుకుంటే తమకు చేదుగా ఉన్నట్లు స్టాలిన్ చీదరించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.



అసెంబ్లీ వెలుపల మీడియాతో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

నీట్‌ను రద్దు చేస్తామని హామీ ఇస్తేనే బీజేపీతో పొత్తుపెట్టుకుంటామని అమిత్ షా దగ్గర ఎందుకు చెప్పలేకపోయారంటూ ప్రశ్నించారు. శాసనసభలో సోమవారం ఉదయం ప్రజారోగ్యశాఖకు సంబంధించిన ఆర్థిక అనుబంధ పద్దులపై చర్చ జరిగింది. ఆ సందర్భంగా ఎవరి పాలనలో రాష్ట్రంలో ఎక్కువగా వైద్యకళాశాలలు వచ్చాయనే విషయం చర్చకు వచ్చింది. రవాణాశాఖ మంత్రి శివశంకర్ మాట్లాడుతూ..గత పదేళ్ల అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలోనే నీట్ పై మినహాయింపు కోరలేదని, ఆ సమయంలో కేంద్రంలోని బీజేపీ పాలకులు, అన్నాడీఎంకే నేతల మధ్య ఓ తమిళ సినిమాలో కామెడీ దృశ్యంలో పేర్కొన్నట్లు 'నీట్‌ను మీరే ఉంచుకోండి, అందుకు ప్రతిఫలంగా 11 వైద్యకళాశాలు ఇవ్వండి' అంటూ 'బేకరీ డీలింగ్' కుదుర్చుకున్నారని యెద్దేవాచేశారు. ఈ సమయంలో ఈపీఎస్ జోక్యం చేసుకుంటూ నీట్ రావటానికి కాంగ్రెస్- డీఎంకే సంకీర్ణ ప్రభుత్వమే కారణమని, ఆ సమయంలో నీట్‌ను తీవ్రంగా వ్యతిరేకించింది అన్నాడీఎంకే మాత్రమేనని చెప్పారు. మంత్రి శివశంకర్ మాట్లాడుతూ కరుణానిధి, జయలలిత అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలోకి నీట్ రాకుండా సమర్థవంతంగా అడ్డుకున్నారని, ఈపీఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే నీట్ పరీక్షలు వచ్చాయని ఆరోపించారు. ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం జోక్యం చేసుకుని అన్నాడీఎంకే పాలనలో 11 వైద్యకళాశాలలకు అనుమతి లభించినా ఆ వైద్యకళాశాలల నిర్మాణపనులు నత్తనడకన నడిచి 20 శాతం పనులు మాత్రమే జరిగాయని, డీఎంకే అధికారంలోకి రాగానే నిర్మాణ పనులు ఊపందుకున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి స్టాలిన్ జోక్యం చేసుకుని మాట్లాడుతూ... నీట్ రద్దు చేయించడానికి అన్నాడీఎంకేకు ఇటీవల మంచి అవకాశం వచ్చిందని, అమిత్‌షాతో పొత్తుపై చర్చలు జరిపినప్పుడు నీట్‌ను మినహాయిస్తామని ప్రకటిస్తేనే పొత్తుపెట్టుకుంటామని నిబంధన పెట్టి ఉంటే బాగుండేదని చెప్పారు. నీట్‌కు శ్రీకారం చుట్టింది డీఎంకే నేతలేనని, శాసనసభ ఎన్నికల సమయంలో నీట్ రద్దు చేయడం తమకే సాధ్యమవుతుందని హామీలతో ఓటర్లను మోసగించి అధికారంలోకి వచ్చారని ఈపీఎస్ ఆరోపించారు. నీట్‌ను రద్దు చేస్తామని తాము ఎవరినీ మోసగించలేదని, కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చి ఉంటే నీట్ నుంచి మినహాయింపును సులువుగా పొంది వుండేవాళ్లమని స్టాలిన్ చెప్పారు. ఇంతే కాకుండా బీజేపీతో పొత్తుపెట్టుకునే ప్రసక్తే లేదని, 2026 అసెంబ్లీ ఎన్నికల్లోనే కాకుండా 2031లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆ పార్టీతో సహవాసం పెట్టుకోమని ప్రతిపక్షనేత ఈపీఎస్ ప్రగల్భాలు పలికి, ప్రస్తుతం ఆ పార్టీతో చెట్టాపట్టాలు వేసుకుని తిరగటం భావ్యమేనా? అని ప్రశ్నించారు.



డీఎంకే సీనియర్ నేత ఆర్కాడు వీరాస్వామిని సోమవారం ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

మా శాఖలో నిధుల్లేవు... నాకు అధికారం లేదు!

● అసెంబ్లీలో వాపోయిన మంత్రి పీటీఆర్



అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్

ప్యారీస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తన శాఖలో నిధులు లేవని, తనకు అధికారమూ లేదంటూ రాష్ట్ర సమాచార సాంకేతిక శాఖా మంత్రి పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్ అసెంబ్లీలో వాపోవడం చర్చనీయాంశమైంది. గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగ సెలవుల అనంతరం సోమవారం ఉదయం అసెంబ్లీ సమావేశాలు పునః ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల సమయంలో గూడలూరు ప్రాంతంలో టైడల్‌పార్కు ఏర్పాటుచేయాలని అన్నాడీఎంకే ఎమ్మెల్యే జయశీలన్ కోరారు. ఇందుకు సమాధానం చెప్పిన మంత్రి పళనివేల్ త్యాగరాజన్, తన ఇలాకాలో తిష్టవేసిన సమస్యలను ఇప్పటికే గత మూడేళ్ళు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించానని, తన శాఖకు మాత్రం అతితక్కువ నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. టైడల్ పార్కు, నియోటైడల్ పార్కుతో పాటు ప్రధాన పరిశ్రమలన్నీ పరిశ్రమల శాఖ ఆధీనంలో ఉన్నాయని చెప్పారు. ఎవరివద్ద పుష్కలంగా నిధులు, ప్రతిభ, అధికారం వుందో వారిని ఆశ్రయిస్తే తమ శాఖకు లబ్ధిచేకూరుతుందని భావిస్తున్నానని, అయితే తన వద్ద ఈ మూడూ లేవని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న సభాపతి అప్పావు, 'శాఖకు సంబంధించిన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరింపజేసుకోండి, సభలో సభ్యులు అడిగే ప్రశ్నలకు సంబంధిత శాఖల మంత్రులు నిజాయితీగా, పారదర్శకంగా సమాధానం చెప్పడమే మంచి సంస్కారం' అని సున్నితంగా మందలించారు.

కడలూరులో రోడ్డు ప్రమాదం

● అన్నాడీఎంకే నేత సహా ముగ్గురి దుర్మరణం



ప్రమాదంలో ధ్వంసమైన బైకు, పక్కనే పడి ఉన్న మృతదేహం



మృతులు నెప్రూహా, శరణ్యా, కల్పన (ఫైల్‌ఫొటోలు)

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కడలూరు సమీపంలో సోమవారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో అన్నాడీఎంకే స్థానిక నాయకుడు సహా ముగ్గురు మృతి చెందారు. కడలూరు సమీపం ఎం.పుదూరుకు చెందిన నెప్రహా (60) అన్నాడీఎంకే స్థానిక కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఎం.పుదూరు సమీపంలో ఆయనకు ఓ జీడిమామిడి తోట ఉంది. ఆ తోటకూ తరచూ వెళ్ళి వస్తుండేవారు. ఈ నేపథ్యంలో జీడిమామిడి తోటలో జీడిపప్పు సేకరించేందుకు నాకియనత్తం ప్రాంతానికి చెందిన శరణ్య (25), కల్పన (25) అనే ఇద్దరు మహిళలను వెంటబెట్టుకుని బైకులో సోమవారం ఉదయం బయలుదేరాడు. ఆ బైకు కడలూరు రామాపురం సమీపంలోని విల్లుపురం - నాగపట్టినం జాతీయ రహదారిలో వెళ్తుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. బైకులో ప్రయాణించిన నెప్రహా, ఇద్దరు మహిళలు దూరంగా రోడ్డుపై పడ్డారు. ఈ సంఘటనలో శరణ్య, కల్పన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇక కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న నెప్రహాను స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మార్గమధ్యంలోనే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు ప్రకటించారు. తిరుపాదిరిపులియూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ప్రమాదంకారణంగా విల్లుపురం - నాగపట్టినం జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

హెల్మెట్ ధరించకుంటే సస్పెన్షన్

● సిబ్బందిని హెచ్చరించిన డీజీపీ


ప్యారీస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలపై వెళ్ళే పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాల్సిందిగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శంకర్ జివాల్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారు, వెనుక కూర్చుని వెళ్ళే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్న నిబంధన అమలులో ఉన్నవిషయం తెలిసిందే! హెల్మెట్ ధరించని వారికి ట్రాఫిక్ పోలీసులు రూ.వెయ్యి జరిమానా విధిస్తున్నారు. వరుసగా మూడుసార్లు హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపితే వారి డ్రైవింగ్ లైసెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ట్రాఫిక్ నిబంధనలు పాటించనివారి నుంచి జరిమానాలు వసూలు చేస్తున్న పోలీసులు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్నారని పలువురు డీజీపీ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా నిబంధనలు అతిక్రమించి పోలీసులు వాహనాలు నడుపుతున్న దృశ్యాలను వీడియో తీసి, సోషల్ మీడియాలో కొంత మంది అప్‌లోడ్ చేయడం పోలీసు శాఖ పేరు ప్రతిష్ఠతలకు భంగం వాటిల్లేలా వుంది. ఇదిలా వుండగా, రాష్ట్రంలోని ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులు, ఎస్పీలకు సోమవారం ఓ సర్క్యులర్ జారీచేశారు. ఆయా పోలీస్ స్టేషన్లలో ప్రతిరోజు ఉదయం జరిగే రోల్‌కాల్‌లో, ద్విచక్రవాహనాల్లో వచ్చే పోలీసులు తమ ఉన్నతాధికారులకు హెల్మెట్ చూపించాలని ఆదేశించారు. హెల్మెట్ లేకుండా విధులకు హాజరయ్యే పోలీసుల వాహనాల తాళాలను స్వాధీనం చేసుకోవాలని, ఐఎస్ఐ హెల్మెట్ కొనుగోలు చేసిన రసీదు చూపించాకే తాళాలు అప్పగించాలని సూచించారు. ఇక నాలుగు చక్రాల వాహనాల్లో వెళ్ళే పోలీసులు సీట్‌బెల్ట్ ధరించాలని, లేనిపక్షంలో వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు రాష్ట్ర కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం

ప్యారీస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సూచనల మేరకు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) సర్వసభ్య సమావేశం మంగళవారం జరగనుంది. రాయపేటలోని పార్టీ కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో సాయంత్రం 4.30 గంటలకు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో వచ్చే ఏడాది అసెంబ్లీకి జరగబోయే ఎన్నికలు, కూటమి, ప్రచారం చేయాల్సిన అంశాలపై చర్చించే అవకాశం వుంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే నేతృత్వంలో దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, నిర్వాహకులు, పలు విభాగాల అధ్యక్షులు పాల్గొని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో 'రాజ్యాంగ వ్యవస్థను కాపాడుకుందాం' అనే నినాదంతో ప్రచారం చేపట్టాల్సిందిగా నిర్ణయించారు. జాతీయస్థాయిలో 40 రోజులపాటు నిర్వహించనున్న ఈ ప్రచారాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్ళి మతవాద బీజేపీ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేలా వ్యవహరించాలని ఖర్గే దిశా నిర్దేశం చేశారు. ఇదిలా వుండగా రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం జరగనున్న సర్వసభ్యసమావేశంలో ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జులు గిరీష్ షోడంకర్, సూరజ్, ఎంఎన్ హెగ్డే ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొననున్నారు. ఈ సమావేశంలో పార్టీ అధిష్టానం తీసుకున్న కీలక నిర్ణయాలపై చర్చించే అవకాశముంది. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులందరూ తప్పనిసరిగా పాల్గొనాల్సిందిగా టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై పిలుపునిచ్చారు.

జీహెచ్‌లో 429 సీసీ కెమెరాలతో నిఘా

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజీవ్ గాంధీ స్మారక సర్వజనీన ప్రభుత్వ ఆస్పత్రి (జీహెచ్)లో డాక్టర్లు, నర్సులు, సిబ్బంది, రోగుల భద్రత కోసం 429 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. ఆ ఆస్పత్రిలో మొత్తం 44 విభాగాలు, 3800 పడకలున్నాయి. అంతే కాకుండా రోజుకు 12 వేల మంది రోగులు చికిత్స పొందుతున్నారు. సుమారు 500 మంది రోజూ ఇన్‌పేషంట్లుగా చేరుతున్నారు.



సీసీ కెమెరాల్లో నమోదవుతున్న దృశ్యాలు



అడ్మిషన్ కౌంటర్ వద్ద రికార్డయిన దృశ్యం

ఆ మధ్య డాక్టర్లపై దాడి, రోగుల వద్ద చోరీలు తదితర అవాంఛనీయ సంఘటనలు జరిగాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆస్పత్రి యాజమాన్యం పటిష్ఠమైన చర్యలు ప్రారంభించింది. ఆ మేరకు ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో నిఘా వేసేలా 429 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. 12 కంట్రోలు రూమ్‌ల ద్వారా సిబ్బంది 24 గంటలపాటు షిఫ్ట్ పద్ధతిలో పర్యవేక్షిస్తుంటారని డీన్ ధరణిరాజన్ పేర్కొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్ ఒక ప్రగతిశీల స్వరం

● ముఖ్యమంత్రి స్టాలిన్ నివాళి

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కరుణాత్మక, ప్రగతిశీల స్వరం అయిన పోప్ ఫ్రాన్సిస్, వినయం, నైతిక ధైర్యం, లోతైన మానవత్వంతో చర్చిని నడిపించారని ముఖ్యమంత్రి కొనియాడారు. పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం విడుదల చేసిన సంతాప సందేశంలో..

"క్యాథలిక్ చర్చిని కరుణ, ప్రగతిశీల సూత్రాలతో నడిపించి, గొప్ప మార్పునకు నాంది పలికిన పోప్ ఫ్రాన్సిస్ మరణ వార్త విని చాలా బాధపడ్డాను. పేదల పట్ల ఆయనకున్న నిబద్ధత, అణగారిన వర్గాల పట్ల ఆయనకున్న ఆప్యాయత, న్యాయం, శాంతి, మతాంతర సంభాషణ కోసం ఆయన చేసిన చొరవ క్యాథలిక్ ప్రపంచం వెలుపల ఆయనకు గొప్ప గౌరవాన్ని సంపాదించిపెట్టాయి. ఆయన మృతితో బాధపడుతున్న వారందరికీ నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను"



శాంథోమ్ చర్చిలో పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళులర్పిస్తున్న చిన్నారులు

అంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ తన సంతాప సందేశం లో నివాళులర్పించారు. అదే విధంగా పలువురు నేతలు కూడా తమ సంతాప సందేశాలు పంపించారు. .

క్యాథలిక్ చర్చి అధిపతి పోప్ ఫ్రాన్సిస్ మరణించారనే వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది. అర్జెంటీనాకు చెందిన పోప్ ఫ్రాన్సిస్, దక్షిణ అమెరికా నుండి ఎన్నికైన మొదటి పోప్‌గా ఘనత వహించారు. పోప్ ఫ్రాన్సిస్, తన 12 సంవత్సరాల పదవీకాలంలో ప్రపంచంలో శాంతి నెలకొల్పేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. పోప్ ఫ్రాన్సిస్ మరణం నాకు వ్యక్తిగతంగా బాధాకరం. పోప్ ఫ్రాన్సిస్ మృతికి దుఃఖిస్తున్న కాథలిక్కులు సహా అందరికీ నా ప్రగాఢ సానుభూతి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.

- డాక్టర్ అన్బుమణి, పీఎంకే నేత

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది క్యాథలిక్‌ల నాయకుడు పోప్ ఫ్రాన్సిస్ మృతిచెందారని తెలిసి చాలా బాధకు గురయ్యాను. 12 సంవత్సరాల పాటు వాటికన్ సిటీకి నాయకత్వం వహించి, ప్రపంచంలో అందరికీ శాంతి అందుబాటులో ఉండాలని సందేశం ఇచ్చిన పోప్, ఆదివారం ఈస్టర్ వేడుకల్లో పాల్గొని ప్రజలను ఆశీర్వదించిన తర్వాత, సోమవారం చర్చి భవనంలోనే మృతిచెందారని తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యాను.

- వైగో, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి.

రోమన్ క్యాథలిక్ చర్చి అధిపతి పోప్ ఫ్రాన్సిస్ 88 సంవత్సరాల వయసులో మరణించారనే వార్త ఎంతో బాధకు గురిచేసింది. ఆయన జీవితమంతా దేవునికి, చర్చికి సేవకు అంకితం చేశారు. ఆయన చర్చి లోపల, వెలుపల క్యాథలిక్ మతంలో వివిధ సంస్కరణలు, మార్పులు తీసుకొచ్చారు

- సెల్వపెరుందగై
తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు.

సమాచార దృష్టి

24 నుంచి డ్రోన్ వినియోగంపై శిక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 26వ తేది వరకు డ్రోన్ వినియోగంపై శిక్షణ ఇవ్వనున్నారు. డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్ ఎగరేయడంలో నిబంధనలు, భద్రత, అవసరమైన అనుమతులు, వ్యవసాయంలో డ్రోన్ వినియోగం, డ్రోన్‌లో వినియోగించే పరికరాలు, వాటికి మరమ్మతులు తదితరాలపై శిక్షణ ఇవ్వనున్నారు. విల్లుపురం విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగనున్న శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు www.editn.in అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవాలి. మరిన్ని వివరాలకు 9080130299, 9080609808 అనే నెంబర్లు సంప్రదించవచ్చని రాష్ట్ర సమాచార శాఖ డైరెక్టర్ ప్రకటన విడుదల చేశారు.

మద్రాసు హైకోర్టుకు మరో ఇద్దరు న్యాయమూర్తులు

పెరంబూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, తెలంగాణా, ఆంధ్ర హైకోర్టుల్లో పనిచేస్తున్న ఏడుగురు న్యాయమూర్తులను ఇతర రాష్ట్రాల హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ఆ ప్రకారం, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు ఇద్దరు మద్రాసు హైకోర్టుకు బదిలీపై రానున్నారు. ఆ ప్రకారం, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి హేమంత్ చందన్ గౌడ, తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి కాకోజు సురేందన్ అలియాస్ కె.సురేందర్ మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది.

ఏసీ సబర్బన్ రైలు సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ

పెరంబూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నై బీచ్-చెంగల్పట్టు మధ్య ఏసీ సబర్బన్ రైలు సేవలు గత శనివారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో, ఈ రైలును ఏఏ సమయాల్లో నడపితే అనుకూలంగా ఉంటుందనే విషయమై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ప్రస్తుతం ఈ రైలు ఉదయం, సాయంత్రం మొత్తం ఆరు సర్వీసులుగా నడుపుతున్నారు. ఈ క్రమంలో, ఏసీ సబర్బన్ రైలు సేవలు మార్పు చేయాలా? అవే సమయాలు కొనసాగించాలా? అనే విషయమై ప్రజలు 6374713251 అనే వాట్సాప్ నెంబరుకు తమ అభిప్రాయాలు తెలియజేయాలని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

టెన్త్, ప్లస్ వన్ మూల్యాంకనం ప్రారంభం

పెరంబూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): టెన్త్, ప్లస్ వన్ మూల్యాంకనం పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు మార్చి 3న ప్రారంభమై ఈ నెల 15 వరకు జరిగాయి. ప్లస్ టూ మూల్యాంకనం ఈ నెల 4వ తేది ప్రారంభం కాగా, ప్లస్ వన్ ఈ నెల 19, టెన్త్ పరీక్షల మూల్యాంకనం ఈ నెల 21వ తేది నుంచి ప్రారంభమవుతాయని ప్రకటించారు. కానీ, గుడ్‌ఫ్రైడ్, ఈస్టర్ పండుగల సందర్భంగా మూడు రోజులు వరుస సెలవులు రావడంతో వాయిదాపడిన మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 30 నాటికి మూల్యాంకన ప్రక్రియ పూర్తిచేసి, మే 19వ తేదీన ఫలితాలు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల శాఖ తెలిపింది.

టెన్త్ సోషల్ సైన్స్ సబ్జెక్ట్‌లో గ్రేస్ మార్క్

పదో తరగతి సోషల్ సైన్స్ పరీక్షకు ఒక గ్రేస్ మార్క్ ఇవ్వనున్నారు. 'జ్యోతిబా పూలే'కు సంబంధించిన ప్రశ్నలో తప్పులు దొర్లాయని, ఈ ప్రశ్నకు ఎలాంటి సమాధానం రాసినా గ్రేస్ మార్క్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పరీక్షల శాఖ సోమవారం ప్రకటన విడుదల చేసింది.

మీటర్ రీడింగ్ ఉద్యోగులకు వేతనం పెంపు

పెరంబూర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ రీడింగ్ చేసే సిబ్బందికి వేతనం పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు, కర్మాగారాలకు రెండు నెలలకు ఒకసారి విద్యుత్ వినియోగం లెక్కిస్తుంటారు. విద్యుత్ బోర్డులో సిబ్బంది కొరత కారణంగా కాంట్రాక్ట్, మాజీ ఉద్యోగులను దీనికి నియమించారు. వారికి ఒక మీటరుకు రూ.4, గ్రామాలు, కొండ ప్రాంతాల్లో రూ.6 ఇస్తున్నారు. తమ వేతనం పెంచాలని కోరుతూ రీడింగ్ తీసే కార్మికులు విద్యుత్ బోర్డుకు దీర్ఘకాలంగా విజ్ఞప్తి చేస్తున్నారు. కార్మికుల విజ్ఞప్తి మేరకు, ఒక మీటరు లెక్కింపుకు రూ.5, గ్రామాలు, కొండ ప్రాంతాల్లో లెక్కింపుకు రూ.7 పెంచుతూ విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీచేసింది.

'వందే భారత్' రైలు ప్రయాణం సురక్షితం

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): 'వందే భారత్' రైలు పూర్తిగా 'కవచ్' భద్రతా వ్యవస్థ నడుమ నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే స్పష్టం చేసింది. మదురై సీపీఎం ఎంపీ వెంకటేశన్ తన ఎక్స్ పేజీలో... వందే భారత్ రైలును పశువులు ఢీకొన్నా ప్రమాదం జరిగేలా ఉందని ఆరోపించారు. ఎంపీ వ్యాఖ్యలపై దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... పశువులు ఢీకొన్నప్పుడు కలిగే నష్టాన్ని తట్టుకొనేలా వందే భారత్ రైలు ముందు భాగం రూపొందించామన్నారు. వందే భారత్ రైలు 160 కి.మీ వేగంతో ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉందని దక్షిణ రైల్వే తెలియజేసింది.

టోల్‌గేట్ ధ్వంసం

● 30 మందిపై కేసు నమోదు


టోల్‌గేట్ సిబ్బందితో ఘర్షణ పడుతున్న ఆందోళనకారులు (ఇన్‌సెట్‌లో) ధ్వంసమైన ఫర్నిఛర్

ప్యారీస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర తూత్తుకుడి సమీపంలోని వాగైకులంలోని టోల్‌గేట్‌ను ధ్వంసం చేసిన 30 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పసుంపొన్ ముత్తురామలింగ దేవర్ మక్కల్ ఈయక్కం అధ్యక్షుడు ఇసైక్కిరాజా నేతృత్వంలో ఆదివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో సుమారు పది కార్లలో బయలుదేరారు. వారు వాగైకులం ప్రాంతంలోవున్న టోల్‌గేట్ చేరుకుని టోల్ టాక్స్ చెల్లించకుండా వెళ్లేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. ఇందుకు అభ్యంతరం తెలిపిన టోల్‌గేట్ సిబ్బందితో ఇసైక్కిరాజాతో వెళ్లినవారు వాగ్వాదానికి దిగి వారిపై దాడికి పాల్పడ్డారు. ఆ టోల్‌ప్లాజాలో వున్న కంప్యూటర్, బిల్లింగ్ పరికరాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేసినట్లు టోల్‌ప్లాజా మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దాడిలో గాయపడిన టోల్‌ప్లాజా సిబ్బందిని తూత్తుకుడి ఆస్పత్రికి తరలించారు. అనంతరం విచారణ చేపట్టిన పోలీసులు అక్కడున్న సీసీ పుటేజీ పరిశీలించారు. దీనికి సంబంధించి ఇసైక్కిరాజా సహా 30 మంది కార్యకర్తలపై హత్యాయత్నం, ప్రజా ఆస్తులు ధ్వంసం, టోల్ సిబ్బందిపై దాడి తదితర ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

కిల్లియూరు ఎమ్మెల్యేకు 3 నెలల జైలు


రాజేష్‌కుమార్

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా కిల్లియూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజేష్‌కుమార్‌కు నాగర్‌కోవిల్ ప్రిన్సిపల్ కోర్టు తీర్పు మూడు నెలల జైలు శిక్ష విధించింది. 2014లో కబ్జాకు గురైన ప్రభుత్వ పొరంబోకు స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించిన ప్రభుత్వ అధికారులను అడ్డుకుని, వారితో గొడవపడి దాడి చేశారు. ఈ సంఘటనపై అధికారులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. ఈ కేసు విచారణ నాగర్‌కోవిల్ ప్రిన్సిపల్ కోర్టులో కొనసాగింది. సోమవారం ఉదయం మేజిస్ట్రేట్ హసన్ మహమ్మద్ తీర్పు వెలువరిస్తూ రాజేష్‌కుమార్ ప్రభుత్వ ఉద్యోగులను డ్యూటీ చేయకుండా అడ్డుకోవడం, వారిపై దాడి జరిపినట్లు సాక్ష్యాధారాలతో సహా రుజువు కావటంతో మూడేళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు పేర్కొన్నారు.

కారులో స్పృహతప్పి వైద్యుడి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కారులో వస్తున్న వైద్యుడు, హఠాత్తుగా స్పృహతప్పి మృతిచెందిన ఘటన ధర్మపురి సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ధర్మపురి కాళియప్పన్ చెట్టి కాలనీకి చెందిన గణేష్ (35) పాలక్కాడు జక్కసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య కనకవల్లి (34) తిరువళ్లూర్‌లోని ఓ ప్రైవేటు కళాశాల ఆస్పత్రిలో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. ఈ దంపతులకు ఐదేళ్ల కుమారుడున్నాడు. ఆదివారం సాయంత్రం విధులు ముగించుకొని కారులో ప్రయాణమైన గణేష్, హోసూరు-ధర్మపురి జాతీయ రహదారిలోని పులిక్కరై జంక్షన్ ఫ్లై ఓవర్ మార్గంలో వస్తుండగా, హఠాత్తుగా మైకం రావడంతో రోడ్డు పక్కనే కారు ఆపి స్పృహతప్పి పడిపోయాడు. చుట్టుపక్కల వారు ఆయనకు వెంటనే ధర్మపురి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థినికి అబార్షన్

● అసిస్టెంట్ ప్రొఫెసర్ అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థినికి గర్భం చేసి అబార్షన్ చేయించిన వ్యవహారంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను పోలీసులు అరెస్ట్‌చేశారు. చెంగల్పట్టు జిల్లా పడూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో ఓ మహిళ అబార్షన్ చేయించుకునే సమయంలో తీవ్ర రక్తస్రావం అయి ప్రమాదకర పరిస్థితి నెలకొందని కిలాంబాక్కం పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఆస్పత్రికి వెళ్లి విచారించగా, సదరు మహిళ తమిళనాడు వ్యాయామ విశ్వవిద్యాలయంలో చదువుతున్నట్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆమెకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేశాడని, ఈ విషయం బయటకు తెలియకుండా అబార్షన్‌కు చేయించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై తాళంబూరు పోలీసులు కేసు నమోదుచేసి, బాధిత యువతిని చెన్నై ప్రభుత్వాసుపత్రికి తరలించి, ప్రొఫెసర్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

ముసిరి వద్ద యువకుడి దారుణహత్య


హతుడు గోపీనాథ్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా ముసిరి సమీపంలో ఇంటి ముందు మంచంపై నిద్రపోతున్న యువకుడిని గుర్తు తెలియని దుండగులు పెట్రోలు పోసి నిప్పంటించి హతమార్చారు. ముసిరి సమీపంలోని వేలంపట్టిలో సెల్వి అనే వితంతువు కుమారుడు గోపీనాథ్ (26)తో కలిసి పొలం వద్ద నున్న ఇంటిలో నివసిస్తున్నారు. సెల్వి కుమార్తె చెన్నైలో చదువుతోంది. ఇంజనీరింగ్ డిప్లొమా చేసిన గోపీనాథ్ వ్యవసాయపనులు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గోపీనాథ్ ఆదివారం రాత్రి ఇంటి ముందు నులక మంచం వేసుకుని నిద్రపోగా. అతడి తల్లి సెల్వి ఇంటిలో నిద్రపోయింది. ఈ నేపథ్యంలో సోమవారం వేకువజాము గుర్తుతెలియని దుండగులు మంచంపై ఒంటరిగా నిదురపోతున్న గోపీనాథ్‌పై పెట్రోలు పోసి నిప్పంటించి పారిపోయారు. మంటల్లో చిక్కుకుని గోపీనాథ్ మృతి చెందాడు. సోమవారం ఉదయం లేచి చూసిన సెల్వి ఇంటి బయట కాలిపోయి గోపీనాథ్ మరణించి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందింది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసు జాగిలాన్ని రప్పించారు. ఆ జాగిలం మృతదేహం పడి ఉన్న చోటు నుంచి కొద్ది దూరం వరకూ వెళ్ళి ఆగిపోయింది. తా.పేట్టై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

రౌడీ హత్య కేసులో ఏడుగురి అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడి ఉదయసూర్యన్ నగర్‌లో ఓ రౌడీ హత్య కేసులో పోలీసులు ఏడుగురి అరెస్ట్ చేశారు. ఉదయసూర్యన్ నగర్‌కు చెందిన ప్రముఖ రౌడీ రాజ్ (40) భార్య దీప (38) దంపతులకు కీర్తిక (10), తనిష్క (3) అనే ఇద్దరు కుమార్తెలున్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా ఆదివారం ఆటోలో తమ కుటుంబ సభ్యులతో కలిసి వ్యాసర్పాడి ప్రాంతంలోవున్న ఓ చర్చికి వెళ్తున్న సమయంలో, రెండు బైకుల్లో వచ్చిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో చేసిన దాడిలో రాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలిసి అక్కడికి చేరుకున్న వ్యాసర్పాడి సీఐ షణ్ముగ సుందరం రౌడీని హతమార్చిన అదే ప్రాంతానికి చెందిన మణికంఠన్, అజయ్‌కుమార్ , అజిత్ సహా ఏడుగురిని అరెస్టు చేసి, విచారణ చేపట్టారు.

పిడుగుపాటుకు బాలిక మృతి

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లాలో పిడుగుపాటుకు విద్యార్థిని మృతిచెందింది. విలాత్తికుళం సమీపం కురలయపట్టి ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం హఠాత్తుగా పిడుగులతో వర్షం కురిసింది. ఆ సమయంలో ఇంటి ప్రాంగణంలో ఎండబెట్టిన మిరపకాయలు తీసేందుకు వెళ్లిన ముత్తుకౌసల్య (17) సమీపంలో పడిన పిడుగుతో షాక్‌కు గురై ఘటనా స్థలంలోనే మృతిచెందింది.

586 మంది ఆలయ సిబ్బందికి ఇళ్లు

● మంత్రి పీకే శేఖర్‌బాబు

ప్యారీస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులు, సిబ్బందికి ప్రభుత్వం తరుపున నిర్మించే గృహసముదాయాల్లో ఇళ్లు కేటాయించాలని నిర్ణయించినట్లు హిందూ దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటించారు. సోమవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో తమ నియోజకవర్గంలోని తిరునీర్‌మలై రంగనాథ పెరుమాళ్ ఆలయంలో పనిచేస్తున్న సిబ్బందికి ఇళ్లు కేటాయించే అవకాశముందా అని పల్లావరం డీఎంకే ఎమ్మెల్యే ఈ.కరుణానిధి ప్రశ్నించారు. దీనిపై మంత్రి శేఖర్‌బాబు సమాధానమిస్తూ, 108 దివ్యదేశాల్లో 61వ ఆలయంగా పేరొందిన తిరునీర్‌మలై రంగనాథ పెరుమాళ్ ఆలయంలో పనిచేస్తున్న 12 మంది అర్చకులకు రూ.2.62 కోట్లతో ఇళ్ల నిర్మాణం పనులు చేపట్టి, ఇప్పటివరకు 92శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఈ ఆలయంలో రూ.10 కోట్ల తో రోప్‌కార్ పథకం కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. రూ.86 కోట్లతో 586మంది అర్చకులు, సిబ్బంది కోసం ఇళ్ల నిర్మాణం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు.

మఠంలో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరువారూర్‌లో ధర్మపురం ఆధీనం నిర్వహణలోని మఠంలో చొరబడి నగదు దోచుకున్న వ్యక్తిని పోలీసులు 24 గంటల వ్యవధిలో అరెస్టు చేశారు. తిరువారూర్ పోలీస్ స్టేషన్ సమీపంలోవున్న మఠంలో శనివారం అర్ధరాత్రి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తి బీరువాలో వున్న రూ.88 వేల నగదుతో పరారయ్యాడు. ఆదివారం ఉదయం మఠానికి వెళ్ళిన ఉద్యోగులు బీరువా తెరచివుండటంతో నగదు చోరీకి గురైనట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మఠం పరిసరాల్లోని సీసీ పుటేజీ పరిశీలించి విచారణ జరిపారు. ఇందులో మఠం వెనుక మైదానంలో ఇటీవల రాట్నం ఏర్పాటు చేశారు. దీని నిర్మాణం పనుల్లో పాల్గొన్న కొంతమంది కార్మికుల్లో ఒకరు ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. దీనితో పాపనాశం ప్రాంతానికి చెందిన సాదిక్ (35)ను అదుపులోకి తీసుకున్న పోలీసులు మేజిస్ట్రేట్‌లో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు.

ఎంటీసీ సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు

పెరంబూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ)లో పనిచేస్తున్న ఉద్యోగులకు బయోమెట్రిక్ తప్పనిసరి చేశారు. ఈ మేరకు ఎంటీసీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభుశంకర్ విడుదల చేసిన ప్రకటనలో... ఎంటీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల హాజరు బయోమెట్రిక్‌లో నమోదుచేయాలని 2024 జూలై 1వ తేది ప్రకటన వెలువడింది. ఆ ప్రకారం, ఎంటీసీ ప్రధాన కార్యాలయం, డిపోలు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్ తదితర సిబ్బంది కార్యాలయాలని వచ్చి, వెళ్లే సమయాలను బయోమెట్రిక్‌లో నమోదుచేయాలని, ఈ విధానం సోమవారం నుంచి అమలుకు వచ్చిందని ఎంటీసీ ఎండీ తెలియజేశారు.

ఉద్యోగుల రచనలకు, ప్రచురణకు అనుమతి అవసరం లేదు

- రాష్ట్ర ప్రభుత్వం

పెరంబూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు పుస్తకాలను ప్రచురించే ముందు ప్రభుత్వ అనుమతి పొందాల్సి ఉండేది. ప్రస్తుతం కలైంజర్ సెంటినరీ వేడుకల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఈ నియమానికి కొన్ని సవరణలు చేసింది. ఆ ప్రకారం, ప్రభుత్వ కార్యకలాపాలు, విధానాలకు సంబంధించిన పుస్తకాలు తప్ప, ప్రభుత్వ ఉద్యోగులు సాహిత్యం, కథలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు, కవితలు, వృత్తిపరమైన, విద్యా పుస్తకాలు రాసేందుకు, ప్రచురించేందుకు ముందస్తు అనుమతి పొందాల్సిన అవసరం లేదు. కానీ, తమ శాఖ అధికారికి సమాచారం ఇచ్చి పుస్తకాలు ప్రచురించవచ్చు. పుస్తకంలో రాష్ట్రంపై ఎలాంటి విమర్శలు లేవని, శాంతిభద్రతలు ప్రభావితం చేసే అంశాలు లేవని నిర్ధారిస్తూ స్వీయ ప్రకటన సమర్పించాలి. ప్రభుత్వ ఉద్యోగి తన అధికారిక సమయం, పదవిని పుస్తకాల విక్రయాలు ప్రోత్సహించేలా ఉపయోగించరాదు. ఈ పుస్తకం ప్రభుత్వ విధానాలు, కార్యకలాపాలను వ్యతిరేకంచకూడదు. అలాగే సామాజిక ఐక్యతను ప్రభావితం చేయరాదు. తదితర సవరణలతో ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

ఢిల్లీ విమానంలో సాంకేతికలోపం

పెరంబూర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం స్వదేశీ విమానాశ్రయం నుంచి ఢిల్లీ బయల్దేరాల్సిన విమానంలో హఠాత్తుగా సాంకేతికలోపం తలెత్తింది. సోమవారం ఉదయం 5.55గంటలకు చెన్నైనుంచి ఢిల్లీ వెళ్లే విమానాన్ని రన్‌వేపై తీసుకొచ్చే సమయంలో, పైలెట్ చేపట్టిన తుది తనిఖీల్లో యంత్రంలో లోపం ఉన్నట్లు గుర్తించి, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అప్పటికే విమానం ఎక్కేందుకు సిద్ధంగా ఉన్న ప్రయాణికులను విమానం బయల్దేరడంలో ఆలస్యం జరుగుతుందని తెలిపి వారిని విశ్రాంతి గదుల్లోనే కూర్చోమని అధికారులు చెప్పారు. నిపుణులు విమానంలో సాంకేతికలోపం సరిచేయడంతో గంట ఆలస్యంగా 7 గంటలకు విమానంలో బయల్దేరి వెళ్లింది.

జర్మన్ ప్రయాణికురాలి నుంచి జీపీఎస్ పరికరం స్వాధీనం

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయంలో జర్మనీకి చెందిన మహిళ నుంచి కస్టమ్స్ అధికారులు జీపీఎస్ పరికరం స్వాధీనం చేసుకున్నారు. మీనంబాక్కం విమానాశ్రయం నుంచి శ్రీలంక రాజధాని కొలంబోకు వెళ్తున్న విమాన ప్రయాణికులను అధికారులు తనిఖీ చేశారు. ఆ సమయంలో కొలంబో మీదుగా జర్మనీ వెళ్లాల్సిన క్లాడియా డోరా (57) అనే బ్యాగులో జీపీఎస్ పరికరాన్ని గుర్తించిన అధికారులు, దానికి స్వాధీనం చేసుకున్నారు. తాను జర్మనీ నుంచి వారం రోజుల క్రితం చెన్నై వచ్చినట్లు, అక్కడి నుంచి రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలు సందర్శించి తిరుగు ప్రయాణమవుతున్నానని, తాను వచ్చే సమయంలో ఏ విమానాశ్రయంలో జీపీఎస్ పరికరం తీసుకెళ్లరాదని అధికారులు చెప్పలేదని బాధితురాలు అధికారులకు తెలిపారు. అయినా, ఆమె ప్రయాణం రద్దు చేసిన అధికారులు, ఆమెను విచారిస్తున్నారు.

జలపాతంలో చిక్కుకుని చెంగల్పట్టు వీఏవో మృతి

ప్యారీస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మిత్రులతో కలిసి సరదాగా విహారయాత్రకు వెళ్లిన చెంగల్పట్టు గ్రామ నిర్వాహక అధికారి (వీఏవో) ధర్మపురి జిల్లాలోని హొగెనెకల్ జలపాతంలో చిక్కుకుని మృతిచెందారు.. చెంగల్పట్టు వీఏవో మురుగేశన్ (55)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గత శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడురోజులు సెలవులు రావడంతో ఆయన తోటి ఉద్యోగులు, మిత్రులతో కలిసి కృష్ణగిరి, ధర్మపురి తదితర జిల్లాల్లోని పర్యాటక కేంద్రాలకు విహారయాత్రకు వెళ్లారు. శనివారం హొగెనెకల్ జలపాతంలో స్నానం చేస్తుండగా గల్లంతయ్యాడు. వెంటనే అతని మిత్రులు తెలియజేసిన సమాచారంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆ జలపాతంలో తెల్లవార్లు గాలించారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం మురుగేశన్ మృతదేహాన్ని గుర్తించి బయటికి తీసి, స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విహారయాత్రకు వెళ్ళిన ప్రాంతంలో అకాలమృతి చెందిన మురుగేశన్ మృతదేహాన్ని సోమవారం పోస్టుమార్టం అనంతరం పోలీసులు ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విద్యా ఫీజు పెంపునకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యా ఫీజు పెంపు కోరుతూ ప్రైవేటు పాఠశాలల యజమాన్యం దరఖాస్తు చేసుకోవాలనే ప్రకటన విడుదలైంది. రాష్ట్రంలో సుమారు 12 వేలకు పైగా ప్రైవేటు పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలుచేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో, హైకోర్టు ఉత్తర్వుల మేరకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా ఫీజు నిర్ణయ కమిటీ ఏర్పాటైంది. ప్రస్తుతం కమిటీ అధ్యక్షులుగా మాజీ న్యాయమూర్తి ఆర్.బాలసుబ్రమణియన్ వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో, 2025-26, 2026-27, 2027-28 తదితర మూడు సంవత్సరాలకు విద్యా ఫీజు పెంచాలనుకునే ప్రైవేటు పాఠశాలలు మే 15వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రకటన విడుదలైంది. ఫీజు పెంపు అమలుచేయని పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. దరఖాస్తుతో పాటు విద్యార్థులు,ఉపాధ్యాయుల సంఖ్య, సిబ్బంది వేతనం, గత విద్యా సంవత్సరం ఆదాయ వ్యయాలు తదితర వివరాలు జతచేయాలని ప్రకటనలో సూచించారు.

రేపటి నుంచి పీజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మద్రాసు విశ్వవిద్యాలయం అందిస్తున్న పీజీ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 23 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన విద్యార్థులు www.unom.ac.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని వర్శిటీ సోమవారం ప్రకటన విడుదల చేసింది.

పొన్ముడి వ్యాఖ్యలపై ఆగని నిరసనలు

● మదురైలో అన్నాడీఎంకే మహిళా విభాగం ధర్నా


ధర్నాలో పాల్గొన్న మాజీమంత్రులు వలర్మతి, సెల్లూరు రాజా తదితరులు

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం సమీపంలో జరిగిన ఓ సభలో మంత్రి పొన్ముడి మహిళలను, శైవ, వైష్ణవమతాలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తూ మదురైలో అన్నాడీఎంకే మహిళా విభాగం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మదురై సెల్లూరు రహదారి వద్ద మాజీ మంత్రులు సెల్లూరు రాజు, పి.వలర్మతి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో మంత్రి పొన్ముడిని వెంటనే మంత్రి పదవి నుండి డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. పొన్ముడి వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రజానీకం తీవ్ర నిరసన వ్యక్తం చేసినా, హైకోర్టు ఆయనపై కేసు నమోదు చేసి విచారణ జరపాలని ఆదేశించినా ముఖ్యమంత్రి స్టాలిన్ పట్టించకోకపోవడం గర్హనీయమన్నారు.

పర్మినెంట్ చేయాలని

ఎంటీసీ డ్రైవర్, కండక్టర్ల ధర్నా


కిలాంబాక్కం బస్ టెర్మినల్‌లో ధర్నా చేస్తున్న డ్రైవర్, కండక్టర్లు

ప్యారీస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రో పాలిటన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (ఎంటీసీ)లో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న డ్రైవర్, కండక్టర్లు తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ సోమవారం కిలాంబాక్కం బస్ టెర్మినల్‌లో ధర్నా చేశారు. ఎంటీసీలో డ్రైవర్, కండక్టర్ల పోస్టులకు గత ఏడాది తాత్కాలిక ఉద్యోగులుగా 300 మందిపైగా నియమించారు. 8వ తరగతి వరకే చదువుకున్న వీరికి ఒకరోజు వేతనంగా రూ.750 నిర్ణయించారు. వీరు సెలవు లేకుండా 250 రోజులు పనిచేస్తే పర్మినెంట్ అవుతారని అప్పట్లో ప్రకటించడం జరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థల్లో ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు డ్రైవర్, కండక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటన విడుదలైంది. ఇదిలా వుండగా గత 18 నెలలుగా కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం విధులను బహిష్కరించి ధర్నాలో పాల్గొన్నారు.

మనీల్యాండరింగ్ కేసులో

జాఫర్ సాధిక్ సోదరులకు బెయిలు

ప్యారీస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల స్మగ్లింగ్ కేసులో చట్టవిరుద్ధంగా మనీల్యాండరింగ్‌కు పాల్పడి పట్టుబడిన జాఫర్ సాదిక్, మహ్మద్ సలీమ్‌లకు మద్రాస్ హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. డీఎంకే నేత, సినీ నిర్మాత జాఫర్ సాధిక్ మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డారనే కారణంతో ఈడీ అధికారులు ఆయనపై కేసు నమోదు చేసి, 2024 జూన్ 26న అరెస్టు చేశారు. ఆ తర్వాత ఆయన సోదరుడు మహ్మద్ సలీమ్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో తమకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ జాఫర్ సాదిక్ సోదరులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు హైకోర్టు న్యాయమూర్తి సుందరమోహన్ సమక్షంలో సోమవారం విచారణకు రాగా, ఈడీ, పిటిషనర్ల తరుపు న్యాయవాదులు హాజరై వాదించారు. వాదనలు పూర్తయిన నేపథ్యంలో జాఫర్ సాదిక్, మహ్మద్ సలీమ్‌లకు బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

ఒకే కాన్పులో నలుగురు పిల్లలు

● ఉద్యోగం కోసం దరఖాస్తు

ప్యారీస్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాలో ఒకే కాన్పులో నలుగురు పిల్లలకు జన్మనిచ్చిన ఓ తల్లి అంగన్వాడీ కేంద్రంలో ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించింది. తిరునల్వేలి పత్తమడై ప్రాంతానికి చెందిన తనకు పళనినాథన్‌తో వివాహం జరిగిందని, ఒకే కాన్పులో నలుగురు పిల్లలు పుట్టారని తెలిపింది. కొన్నేళ్ళ క్రితం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తన భర్త మతిస్థిమితం కోల్పోయాడని, భర్త, పిల్లలతో పాటు పుట్టింటిలోనే నివసిస్తున్నట్లు తెలిపింది. పేదకుటుంబానికి చెందిన తాను ప్లస్‌టూ వరకు చదువుకున్నానని, కుటుంబాన్ని పోషించుకునేందుకు అంగన్వాడీ కేంద్రాల్లో సహాయకురాలిగా ఉద్యోగావకాశం ఇప్పించాలని ఆ వినతిపత్రంలో విజ్ఞప్తి చేసింది.

26, 27 తేదీల్లో టీవీకే బూత్ కమిటీ సమావేశం

● హాజరుకానున్న పార్టీ అధ్యక్షుడు విజయ్

పెరంబూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26,27 తేదీల్లో కోయంబత్తూర్‌లో జరుగనున్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) బూత్ కమిటీ సమావేశంలో ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ హాజరుకానున్నారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... దక్షిణ భారత్‌లో మాంచెస్టర్‌గా పిలువబడే కోయంబత్తూర్ కురుంపాళయం ఎస్ఎన్ఎస్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 26,27 తేదీల్లో బూత్ కమిటీ సమావేశం జరుగనుంది. అధికారం మార్పు జరగాలంటే ఓటర్లతో నిరంతరం సంబంధాలున్న బూత్ కమిటీ ఏజెంట్లు ప్రధాన పాత్ర పోషించాల్సి ఉంది. అందువల్ల బూత్ కమిటీ సభ్యులకు దిశనిర్దేశాలు నిర్ణయించేలా సమావేశం నిర్వహించనున్నారు.

ఏడేళ్ల క్రితం మాయమైన బాలిక ఆచూకీ లభ్యం

ప్యారీస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ళ క్రితం మాయమైన 12ఏళ్ళ చిన్నారి 19 ఏళ్ళ యువతి అయిన తరువాత ఆమె ఆచూకీ దొరకడంతో ఆమె కుటుంబ సభ్యులు సంతోషానికి అవధులు లేవు. పోలీసుల కథనం మేరకు అరుంబాక్కం ప్రాంతానికి చెందిన అనురాధ (40) వడపళనిలో వున్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. ఆమె కుమార్తె సిమ్రాన్ (12) 2018వ సంవత్సరం పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కోసం పలు ప్రాంతాల్లో గాలించిన జాడ తెలియకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, పలు ప్రాంతాల్లో పోలీసులు గాలించిన నేపథ్యంలో ఏడేళ్ళ క్రితం మాయమైన సిమ్రాన్‌కు ప్రసుత్తం 19ఏళ్ళని కుటుంబసభ్యులతో వచ్చి ఆమెను గుర్తించి వెంటతీసుకెళ్ళమని ఈ నెల 17వ తేదీ కడలూరు జిల్లాలోని మహిళల సంరక్షణ కేంద్రం నుంచి అరుంబాక్కం పోలీసు స్టేషన్‌కు ఓ వ్యక్తి ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఇన్‌స్పెక్టర్ బాలసుబ్రమణ్యం నేతృత్వంలో సంబంధిత మహిళా సంరక్షణ కేంద్రానికి అనురాధ, చిన్నారుల సంరక్షణా అధికారులు వెళ్ళగా సిమ్రాన్‌ను నిర్వాహకులు వారికి అప్పగించారు.

ఎలక్ట్రిక్ వాహనాలకు ఛార్జింగ్ కేంద్రాలు

● టీఎన్‌ఈబీ ప్రకటన

ప్యారీస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలతో కలిసి ఎలక్ట్రిక్ వాహనాలకు ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్‌ఈబీ) నిర్ణయించింది. ఈ పథకంలో రాజధాని నగరం చెన్నైలో వంద ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు టీఎన్‌ఈబీ ప్రకటించింది. రాష్ట్రాల్లోని జాతీయ రహదారుల్లో కిలోమీటరుకు ఒకటి, నగర సరిహద్దుల్లో మూడు కిలోమీటర్లకు ఒక ఛార్జింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సిందిగా అన్ని విద్యుత్ వినియోగ కేంద్రాలకు కేంద్రం ఆదేశించింది. దీని ఆధారంగా సబ్ స్టేషన్లకు సమీపంలో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం ఓ ప్రణాళిక రూపొందించింది. ప్రస్తుతం చెన్నై, కాంచీపురం, కోయంబత్తూరు, ఈరోడ్, మదురై, తిరుచ్చి, వేలూరు, విల్లుపురం తదితర జిల్లాల్లో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ కోసం 472 కేంద్రాలున్నాయి. అయినప్పటికీ రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా ఛార్జింగ్ కేంద్రాల సంఖ్యను పెంచాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. అందువల్ల స్థానిక సంస్థల సహకారంతో ఏర్పాటు చేయనున్న ఛార్జింగ్ కేంద్రాలకు అవసరమైన స్థలం పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు టీఎన్‌ఈబీ అధికారులు తెలిపారు.

12న మదురై జిల్లాకు సెలవు

ప్యారీస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆలయాల నగరం మదురైలో మే 12వ తేదీ కళ్లలగర్ వైగైనదీ ఆగమన వేడుకల నేపత్యంలో ఆ రోజు స్థానిక సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ సంగీత ఉత్తర్వులు జారీ చేశారు. మదురైలో మే నెలలో చిత్తిరై ఉత్సవాలను నిర్వహించేందుకు హిందూ దేవాదాయ శాఖ, జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నాయి. చిత్తిరై వేడుకల్లో ప్రధాన ఘట్టమైన మీనాక్షి అమ్మవారి సమేత సుందరేశ్వరుడి తిరుకల్యాణం మే 8న వైభవంగా జరుగనుంది. అదేవిధంగా మే 12న వైగైనదిలో కళ్లలగర్ స్వామి అశ్వవాహనంతో పాటు దర్శనమిచ్చే వైభవం జరగనుంది. ఈ నెల 29వ తేదీ మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణంతో ప్రారంభించనున్న చిత్తిరై వేడుకలు మే 12 వరకు జరుగనున్నాయి. ఈ ఉత్సవంలో మదురై జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొనేందుకు వీలుగా మే 12వ తేదీ అయిన సోమవారం జిల్లాకు స్థానిక సెలవులు కలెక్టర్ సంగీత ప్రకటించారు.

సెలవుల్లో చిన్నారులు ఎంజాయ్ చేసే మూవీ 'సుమో'

● హీరో మిర్చి శివ



మీడియా సమావేశంలో చిత్ర బృందం

వేసవి సెలవుల్లో చిన్నారులు ఎంజాయ్ చేసేలా తెరకెక్కించిన చిత్రం 'సుమో' అని ఆ చిత్ర హీరో మిర్చి శివ అన్నారు. భరత్ నటించిన 'ఫిబ్రవరి 14', సంతాను హీరోగా వచ్చిన 'ఆయిరం విలక్కు' వంటి చిత్రాలను రూపొందించిన దర్శకుడు ఎస్.పి.హోసిమిన్ తాజాగా దర్శకత్వం వహించిన చిత్రం 'సుమో'. మిర్చి శివ, ప్రియా ఆనంద్ జంటగా నటించారు. జపాన్‌కు చెందిన రెజ్లర్ యోషినోరి తషికిరో మరో కీలక పాత్ర పోషించారు. ఈ నెల 24న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో మిర్చి శివ మాట్లాడుతూ, 'ఇది పూర్తి వినోదాత్మక చిత్రం. కేవలం వేసవిలో చిన్నారులు ఎంజాయ్ చేసేలా దర్శకుడు రూపొందించారు. జపాన్‌కు చెందిన ఒక సుమోను చెన్నై తీసుకొచ్చి కొన్ని పనులు చేయించేందుకు హీరో ప్రయత్నిస్తాడు. తద్వారా వారిద్దరూ ఎదుర్కొన్న సమస్యలేంటి అన్నదే ఈ చిత్ర కథ' అని పేర్కొన్నారు. దర్శకుడు హోసిమిన్ మాట్లాడుతూ, 'ఒక మంచి సందేశం ఈ చిత్రంలో ఇమిడివుంది. నిర్మాత సహకారంతో ఈ సినిమా షూటింగ్ చెన్నై, టోక్యోలో విజయవంతంగా పూర్తి చేశారు. హీరో, నిర్మాతలకు ధన్యవాదాలు' తెలిపారు. నిర్మాత ఐసరి కె.గణేష్ మాట్లాడుతూ, 'ఇది ఒక ఇంటర్నేషనల్ ఫిల్మ్. ఈ నెల 24వ తేదీన ఇక్కడ విడుదల చేసి, మరో 10 లేదా 15 రోజుల తర్వాత జపాన్‌లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తాం' అని వెల్లడించారు. సంగీత దర్శకుడు నివాస్ కె.ప్రసన్న మాట్లాడుతూ, 'మొత్తం నాలుగు పాటలు ఉన్నాయి. తొలి భాగంలో రెండు, రెండో అర్ధ భాగంలో మిగిలిన రెండు పాటలు ఉంటాయి. సుమోపై 'ఓం గణేష్' అంటూ సాగే పాటను చిత్రీకరించాం. ఈ సాంగ్ ఇప్పటికే పాపులర్ అయింది' అన్నారు. హీరోయిన్ ప్రియా ఆనంద్ మాట్లాడుతూ, 'ఇందులో కనిమొళి అనే పాత్రలో హీరో ప్రియురాలిగా నటించాను. పాత్ర చాలా బాగా వచ్చింది. ప్రతి ఒక్కరూ చూసి ఎంజాయ్ చేసి, సినిమాను విజయవంతం చేయాలని కోరుతున్నాం' అని పేర్కొన్నారు.

అన్నై ఇల్లం జప్తు ఉత్తర్వు రద్దు

● హైకోర్టు తీర్పు



శివాజీ గణేశన్ చిన్నకుమారుడు ప్రభు

నడిగర్ తిలగం దివంగత శివాజీ గణేశన్‌కు చెందిన అన్నై ఇల్లమ్ (ఇల్లు)ను జప్తు చేయాలంటూ గతంలో కోర్టు జారీ చేసిన జప్తు ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు సోమవారం రద్దు చేసింది. శివాజీ చిన్న కుమారుడు, సినీ నటుడు ప్రభు ఇంటికి సంబంధించి సమర్పించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకుని ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. శివాజీ గణేశన్ మనవడు, రాంకుమార్ తనయుడు దుష్యత్ తన నిర్మాణ సంస్థ ఈసాన్ ప్రొడక్షన్స్‌పై చిత్ర నిర్మాణం కోసం రూ.3.74 కోట్ల రుణాన్ని ధనభాగ్యం ఎంటర్‌ప్రైజెస్ నుంచి తీసుకున్నారు. ఈ రుణాన్ని సకాలంలో చెల్లించకపోగా, సినిమా హక్కులను కూడా తమకివ్వలేదంటూ ధనభాగ్యం ఫైనాన్స్ కంపెనీ కోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణలో ఈసాన్ పతాకంపై దుష్యత్ ఎలాంటి చిత్ర నిర్మాణం చేపట్టలేదని తేలింది. దీంతో రాంకుమార్, దుష్యంత్ నివసిస్తున్న శివాజీ గణేశన్ ఇంటిని జప్తు చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలతో అప్రమత్తమైన శివాజీ రెండో కుమారుడు ప్రభు.. ఆ ఇల్లు పూర్తిగా తనకు సొంతమని, ఇంటి వీలునామా తన పేరుపైనే ఉందని అందువల్ల ఇంటి జప్తు ఉత్తర్వులు రద్దు చేయాలంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసులో పలు దఫాలుగా జరిగిన విచారణ పూర్తికావడంతో సోమవారం కోర్టు తీర్పును వెలువరిస్తూ, ఇల్లు జప్తు ఉత్తర్వులను రద్దు చేస్తూ, శివాజీ గణేశన్ నివాసం పూర్తి హక్కుదారు ప్రభు అంటూ తుది తీర్పును వెలువరించింది.

శ్రద్ధా శ్రీనాథ్ 'కలియుగం'

ఫస్ట్‌లుక్ రిలీజ్



ఫస్ట్‌లుక్ రిలీజ్ దృశ్యం

శ్రీద్ధా శ్రీనాథ్, ఆడుగలం కిషోర్ జంటగా నటించిన 'కలియుగం' ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను తాజాగా రిలీజ్ చేశారు. పోస్ట్ - అపోకలిప్టిక్ సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో ఈ మూవీని రూపొందించి, మే 9వ తేదీ ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ మూవీ ద్వారా ప్రమోద్ సుందర్ కోలీవుడ్‌కు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆర్‌కే ఇంటర్నేషనల్, ప్రైమ్ సినిమాస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి కేఎస్ రామకృష్ణ, కే.రామ్‌చరణ్ నిర్మాతలు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'ఇది ఒక ఫిక్షనల్ స్టోరీ. సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. శ్రద్ధా శ్రీనాథ్, కిషోర్‌తో పాటు ఇనియన్ సుబ్రమణి, అజ్మల్, హరి, మిథున్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు.

'ఉదవుం మనిదం' పేరుతో నటుడు బ్లాక్ పాండి సాయం



సంక్షేమ సహాయాన్ని పంపిణీ చేస్తున్న నటుడు రాధారవి

కోలీవుడ్ నటుడు, సామాజిక కార్యకర్త, 'ఉదవుం మనిదం' వ్యవస్థాపకుడు బ్లాక్ పాండి 'ఉదవుం మనిదం' పేరుతో అనేక మంది పేద కళాకారులకు, మానసిక దివ్యాంగులకు సాయం చేస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా 300 మందికి వివిధ రకాల సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. శ్రీలంకకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజిక కార్యకర్త త్యాగి అయ్య కూడా తన వంతు సాయం చేశారు. వీరంతా కలిసి వంద మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఇతర ఉపకరణాలను అందజేశారు. 80 మంది దివ్యాంగులకు రూ.2 వేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. దృష్టి లోపంతో బాధపడుతున్న 20 మందికి పవర్ గ్లాస్‌లు ఇచ్చారు. ముగ్గురు పేద విద్యార్థులకు రూ.3 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆరుగురు హిజ్రాలకు రూ.2 వేల విలువైన సరకులను పంపిణీ చేశారు. ఇద్దరు వితంతువులకు రెండు కుట్టు మిషన్లు, లాండ్రీ కార్మికుడుకి ఐరన్ బాక్స్, ఒక బాలికకు విలువిద్య శిక్షణ కోసం రూ.5 వేలు నగదు, విద్యార్థిని దీపలక్ష్మికి రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. అలాగే, 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నటుడు రాధారవి, తలైవాసల్ విజయ్, వయ్యాపురి, డానీ పోప్, విచిత్ర, పళనియప్పన్, పడయప్ప రమేష్, వెట్రివేల్ రాజా, సామాజిక కార్యకర్తలు శరణ్య జయకుమార్, నమిత తదితరులు పాల్గొన్నారు.

మేట్టూరు డ్యామ్‌లో పెరిగిన నీటిమట్టం



మేట్టూరు డ్యామ్ నుండి విడుదలవుతున్న జలాలు

టి.నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మేట్టూరు డ్యామ్‌లోకి ప్రవేశిస్తున్న జలపరిమాణం గత మూడు రోజులుగా విపరీతంగా పెరిగిందని జల వనరుల శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆ డ్యామ్‌లోకి సెకనుకు 2832 అడుగుల చొప్పున నీరు వస్తోంది. ఇదే విధంగా హొగెనేకల్ జలపాతంలోకి సెకనుకు 4వేల ఘనపుటడుగుల చొప్పున జలాలు ప్రవేశిస్తున్నాయి. శనివారం ఉదయం మేట్టూరు డ్యామ్‌లోకి సెకనుకు 1385 అడుగుల చొప్పున జలాలు ప్రవేశించాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రానికి డ్యామ్ ఇన్‌ఫ్లో 2832 అడుగులకు చేరింది. ప్రస్తుతం సెకనుకు వెయ్యి ఘనపుటడుగుల చొప్పున అదనపు జలాలను విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో పెరుగుతుండటంతో డ్యామ్ నీటిమట్టం 107.55 అడుగులకు పెరిగింది. దీంతో జూన్ రెండోవారంలోగా డ్యామ్ నీటిమట్టం పూర్తి స్థాయికి చేరుతుందని, ఆ తర్వాత డ్యామ్ నుండి సాగుజలాలను విడుదల చేసే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

వీఐటీ వర్సిటీ 'సెల్ఫ్ హెల్ప్ గ్రూప్' కేంద్రం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ తదితరులు

వేలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడిలోని వీఐటీ యూనివర్సిటీ ప్రాంగణంలో మహిళా స్వయం సహాయక బృందాలు (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్) తయారుచేసిన వస్తువుల విక్రయ కేంద్రం సోమవారం ప్రారంభమైంది. కాట్పాడి డివిజన్ పరిధిలోని మహిళా సంఘాలు తయారుచేసిన ఉత్పత్తులు విక్రయించేలా 2020వ సంవత్సరంలో విక్రయ కేంద్రం ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా మహిళా బృందాలకు ఆదాయంతో పాటు కళాశాల విద్యార్థులకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసే ఉద్దేశంతో ఈ కేంద్రం ప్రారంభించారు. కొవిడ్ కారణంగా ఈ కేంద్రం మూతపడింది. ప్రస్తుత జిల్లా కలెక్టర్ చొరవతో మళ్లీ వర్సిటీ ప్రాంగణంలో విక్రయ కేంద్రం ఏర్పాటుచేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్, కలెక్టర్ సుబ్బులక్ష్మి కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి విక్రయాలు ప్రారంభించారు. కార్యక్రమంలో వర్సిటీ ఉపాధ్యక్షులు జీవీ శంకర్, జీవీ శేఖర్, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెందిల్‌కుమార్ సహా పలువురు పాల్గొన్నారు.





వేలూరు సమీపంలోని అరియూర్‌లో ఉన్న నారాయణి పీఠాన్ని సందర్శించి శక్తి అమ్మ ఆశీస్సులు అందుకుంటున్న అమ్మ మక్కళ్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్

బెల్జియం కార్‌రేస్‌లో అజిత్‌కు ద్వితీయ స్థానం

ప్యారీస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బెల్జియంలో ఇటీవల జరిగిన జీటీ4 ఐరోపా కార్‌రేసులో ప్రముఖ నటుడు అజిత్ కుమార్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని భారతదేశానికి ఘనత చేకూర్చారు. ఈ విజయం గురించి అజిత్‌కుమార్ రేసింగ్ జట్టు అధికారికంగా ఎక్స్ పేజీలో విడుదల చేసింది. తన అభిమాన నటుడు కార్ రేసులో వరుస విజయాలు సాధించడంపై ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. అజిత్ కార్ రేస్ జట్టు దుబాయ్‌లో జరిగిన 24గంటల పోటీలో పాల్గొని తృతీయస్థానాన్ని కైవసం చేసుకుంది. ఆ తర్వాత ఇటలీలో జరిగిన కేసులో తృతీయ స్థానం, ఇటీవల బెల్జియంలో జరిగిన పోటీలో ద్వితీయస్థానం దక్కించుకుని హాట్రిక్ విజయం సాధించడం గమనార్హం.




సచివాలయంలో సోమవారం ఉదయం రవాణా శాఖ మంత్రి శివశంకర్ నుండి నియామక పత్రాలు అందుకున్న 25 మంది యువతీయువకులు



స్థానిక సంస్థల్లో నియామక పద్ధతిలో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించేలా చట్ట సవరణ బిల్లును ప్రతిపాదించినందుకు క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిని కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న దివ్యాంగులు

పురావస్తు తవ్వకాలు..
బంగారు పూస, మట్టికుండ లభ్యం



లభ్యమైన బంగారు పూస, మట్టి కుండ

పెరంబూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లాలో జరుపుతున్న పురావస్తు తవ్వకాల్లో బంగారు పూస, మూతిపెట్టి ఉన్న మట్టికుండ లభ్యమయ్యాయి. విరాలిమలై సమీపం కొడుంబాలూరులో సుమారు 3 వేల ఏళ్ల నాటి ప్రాచీన మూవర్ ఆలయం, ముసుకుండీశ్వరర్ సహా వివిధ చారిత్రక ప్రదేశాలతో దేవాలయాలున్నాయి. కొడుంబలూరులోని అగ్రహారం కొండ ప్రాంతాల్లో కేంద్ర పురావస్తు శాఖ తవ్వకాలు చేపట్టింది. ఈ తవ్వకాల్లో గ్రాము బరువైన బంగారు పూస, మూసి ఉన్న మట్టి కుండ లభ్యమయ్యాయి. ఉన్నతాధికారుల సమక్షంలో కుండను తెరుస్తామని అధికారులు తెలిపారు.

జ్యూస్ కావాలా...కేసు కావాలా...?

● ట్రాఫిక్ పోలీసుల వినూత్న ప్రచారం



హెల్మెట్ ధరించిన వారికి జ్యూస్ అందిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పెరంబూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కడలూరు ట్రాఫిక్ పోలీసులు వినూత్న ప్రచారం చేపట్టారు. కడలూరు టౌన్ హాల్ సమీపంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్ నేతృత్వంలో పోలీసులు, ద్విచక్రవాహనాలపై వస్తున్న వారిని అడ్డుకున్నారు. వారిలో హెల్మెట్ ఉన్న వారికి జ్యూస్, మజ్జిగ అందజేసి అభినందించారు. హెల్మెట్ లేకుండా వచ్చిన వారిని హెచ్చరించడంతో పాటు మరోసారి చిక్కితే జరిమానా విధిస్తామని హెచ్చరించి పంపారు.



చేపలవేటపై నిషేధం కొనసాగుతుండడంతో చెన్నై కాశిమేడులోని చేపల హార్బర్‌లో ఉన్న పడవలు



చెన్నై రిప్పన్‌భవనంలో సిబ్బందికోసం ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్ ప్రారంభిస్తున్న మేయర్ ఆర్.ప్రియ



శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. దర్శకుడు గోపిచంద్ మలినేని, సంగీత దర్శకుడు తమన్, హీరో అశ్విన్‌బాబు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.


నా పేరు యూనివర్స్



నా పేరు యూనివర్స్ రాజకీయపార్టీ పెడుతున్నా, మద్దతివ్వండి.. అని కోరుతూ సోమవారం ఉదయం తిరుపతిలోని ప్రకాశం పార్కు కూడలి వద్ద ఓ వ్యక్తి ఫ్లెక్సీతో నిలబడ్డారు. కోనసీమ ప్రాంతానికి చెందిన తాను రాజకీయ పార్టీ స్థాపించే నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రాథమికంగా ఈ చర్యకు పూనుకున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం నుంచి మొదలై రెండు వారాలుగా ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో పర్యటించానన్నారు. ప్రస్తుతం రాయలసీమ జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.85 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,746

తలనీలాలు సమర్పించినవారు: 25,078



గుమ్మళ్లదిబ్బ తీరప్రాంతంలో తాబేళ్ల సంరక్షణ కేంద్రం





సముద్రంలోంచి తీరానికి వచ్చి ఇసుకలో గుంతలోడి ఇలా గుడ్లు పెట్టి మళ్లీ సముద్రంలోకి వెళ్లిపోతాయి



ఆ గుడ్లను రాత్రి పూట సేకరిస్తారు



వాటిని సంరక్షణ కేంద్రంలో మళ్లీ గుంతలు తీసి పూడుస్తారు

సాగర పర్యావరణ నేస్తాలు

సముద్ర పర్యావరణాన్ని సమతల్యం చేసే ఆలివ్‌రిడ్లే తాబేళ్ల పరిరక్షణకు ట్రీ ఫౌండేషన్ సంస్థ(చెన్నై), అటవీశాఖలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయి.జిల్లాలో రెండు సంరక్షణ కేంద్రాల ద్వారా వీటిని కాపాడుతూ సంతోనోత్పత్తి వృద్ధికి దోహదపడుతున్నాయి. చిల్లకూరు మండలం గుమ్మళ్ళదిబ్బ, కోట మండలం శ్రీనివాససత్రం తీరప్రాంతాల్లో ఉన్న ఈ కేంద్రాలు ఆలివ్ రిడ్లే జాతి తాబేళ్లను కంటికి రెప్పలా చూస్తూ సాగర పర్యావరణ హితానికి పాటుపడుతున్నాయి.

- గూడూరు,ఆంధ్రజ్యోతి



గుడ్లనుంచి పిగిలిన తాబేలు పిల్లలు వెళ్లిపోకుండా గంపలు కప్పి పెడతారు



● ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు ట్రీ ఫౌండేషన్, అటవీశాఖల సమష్టి కృషి

వ్యర్థపదార్థాల వల్ల సముద్రం కలుషితంగా మారుతుంది. దీంతో ఎన్నో జీవజాతులు అంతరించిపోతున్నాయి. తాబేళ్లు ఈ వ్యర్థపదార్థాలను, లోపలి ఇతర మొక్కలను, పాచిని తింటూ సాగర జలం కలుషితం కాకుండా చూస్తున్నాయి. ఇవి సముద్ర అడుగు భాగాన్ని పరిశుభ్రం చేస్తుంటాయి. దీంతో పలు రకాల చేపలు పరిశుభ్ర వాతావరణంలో తిరుగుతూ సంతాన ఉత్పత్తిని పెంచుకుంటాయి. చిన్నపాటి చేపల జాతులను నాశనం చేసే జెల్లీఫిష్‌లను తాబేళ్లు అంతమొందిస్తున్నాయి. ఫలితంగా ఆ జాతులు కూడా వృద్ధి చెందుతున్నాయి.

తాబేళ్ల పిల్లల పరిరక్షణ

సాగర పర్యావరణ మిత్రులుగా నిలుస్తున్న తాబేళ్ల సంరక్షణకు,వృద్ధికి ట్రీ ఫౌండేషన్, అటవీశాఖ సంయుక్తంగా పాటుపడుతున్నాయి.ఇందులో భాగంగా స్థానిక మత్స్యకారులకు శిక్షణ ఇచ్చి సీ టర్టిల్ ప్రొటక్షన్ ఫోర్స్‌గా నియమిస్తున్నాయి. ఈ సిబ్బంది సముద్ర తీరంలో తాబేలు గుడ్లు పెట్టిన చోటును గుర్తిస్తారు. తాబేలు సగటున 80 నుంచి 160 వరకు గుడ్లను పెడుతుంది. వీటిని గుడ్లసంచులలో సేకరించి తాబేలు సంరక్షణ కేంద్రానికి తీసుకువస్తారు. తీరాన ఎంత లోతు, విస్తీర్ణంలో గుడ్లను పెడుతుందో అదేవిధంగా కేంద్రాల్లో తాత్కాలిక గూళ్లను ఏర్పాటు చేసి సంరక్షిస్తారు. 48 నుంచి 52 రోజుల తరవాత గుడ్ల నుంచి పిల్లలు బయటకు వస్తాయి. 35 డిగ్రీలు కంటే ఎక్కువ ఉష్ణోగ్రత లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. 30 డిగ్రీల లోపు ఉష్ణోగ్రత ఉన్న సమయంలో ఎక్కువ శాతం మగ తాబేళ్లు, 30 నుంచి 33 డిగ్రీల సమయంలో ఆడ తాబేళ్లు పుడతాయి. పుట్టగానే భద్రంగా వీటిని తీసుకువెళ్లి సముద్రంలోకి వదులుతుంటారు. గత ఏడేళ్లలో గుమ్మళ్లదిబ్బ తీరంలో ఇలా 3685, శ్రీనివాసత్రం నుంచి 1500కి పైగా తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలారు. సాధారణంగా ఆలీవ్ రిడ్లే జాతి తాబేళ్లు నవంబరు నుంచి మార్చి వరకు గుడ్లు పెడుతాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు సంరక్షణా కేంద్రాల్లో పిల్లలను సముద్రంలోకి వదులుతుంటారు.

ఇవీ విశిష్టతలు

- ఆలివ్‌రిడ్లే జాతి తాబేళ్లు సుమారు 100 నుంచి 180 ఏళ్ల వరకు జీవిస్తాయి. ●సుమారు 30 నుంచి 40 కేజీల వరకు పెరుగుతాయి.
- ఎక్కడ పుట్టి సముద్రంలోకి వెళతాయో.. తిరిగి అక్కడికే చేరుకుని గుడ్లు పెట్టడం వీటి విశిష్టత.
- సముద్రంలో సుమారు 2000 కిలోమీటర్లు సంచరిస్తుంటాయి.
- గుడ్లు పెట్టే సమయానికి గుంపులుగా తీరంలో తాము పుట్టిన చోటుకు చేరుకుంటాయి. ●రాత్రి వేళ్ల ఒకటిన్నర అడుగు లోతు మేర గుంటను తవ్వుకుని గుడ్లను పెట్టి తిరిగి సముద్రంలోకి వెళతుంటాయి.
- వీటి గుడ్లు 20-35 డిగ్రీల ఉష్ణోగ్రతను మాత్రమే తట్టుకోగలుగుతాయి.
- పుట్టినపుడు 50 గ్రాముల వరకు వుంటుంది.
- ఆడ తాబేలు 12 నుంచి 15 ఏళ్ల వయసులో గుడ్లు పెట్టడం మొదలుపెడతాయి.







తాబేలు పిల్లలను తిరిగి సముంద్రంలోకి వదులుతారు



మళ్లీ మళ్లీ వాళ్లే..!

- ఎస్పీ కార్యాలయానికి వచ్చినా క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలు
- సీఐలు, ఎస్ఐల వద్ద పేరుకుపోతున్న పీజీఆర్ఎస్ ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయానికి వెళితే సమస్య పరిష్కారం అవుతుంది. ఇదీ చాలామందిలో ఉన్న నమ్మకం. దీనికోసం ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వ్యయప్రయాసలకు ఓర్చి అర్జీదారులు వస్తున్నారు. ఇక్కడ్నుంచి ఆయా స్టేషన్లకు పంపితే.. మళ్లీ సమస్య మొదటికే వస్తోంది. దీంతో మళ్లీ మళ్లీ వీరంతా తిరుపతికే రావాల్సి వస్తోంది. జిల్లా పోలీసు కార్యాలయంలోని పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యమిస్తూ.. అన్నింటినీ పరిష్కరించే దిశగా ఎస్పీ హర్షవర్ధనరాజు వినూత్న ఆలోచన చేశారు. ఇక్కడ ఫిర్యాదులు పరిశీలించి ఎవరి పరిధి? ఎక్కడకు పంపాలి? ఎందుకు పరిష్కారం కాలేదు అని తెలుసుకోవడానికి ప్రతి వారం ఇద్దరు అదనపు ఎస్పీలు, తొమ్మిది మంది సీఐలు, సిబ్బంది పాల్గొనేలా చర్యలు చేపట్టారు. కానీ, తదనుగుణంగా ఫిర్యాదుల పరిష్కారంలో కొంతమంది అధికారులు చొరవ చూపక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు ఇటీవల అదనపు ఎస్పీ క్రైం నాగభూషణం వద్దకు ఒక మహిళ ఫిర్యాదు తీసుకొచ్చారు. దీనిని పరిశీలించిన ఆయన గత వారం వచ్చావు కదమ్మా..మళ్లీ ఎందుకు వచ్చావని అడిగారు. 'సార్ మీరు సీఐ వద్దకు వెళ్లమన్నారు. అక్కడకు వెళితే రిసెప్షన్‌లో కూర్చున్న పోలీసు సార్ ఒకాయన నన్ను సీఐ వద్దకు పంపడంలేదు. సార్ బిజీగా వున్నారు? రేపు రండి ఎల్లుండి రండి అన్ని తిప్పారు. అందువల్లే మళ్లీ వచ్చాను సార్' అని ఆవేదన వ్యక్తం చేశారామె. చాలా పోలీసు స్టేషన్లలో జరుగుతున్న తంతు ఇదే. దీంతో ప్రతి వారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు పెరుగుతున్నాయి. కాగా, ఎస్పీకి నివేదికలు సమర్పించే క్రమంలో కొందరు తప్పుడు వివరాలు అందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారులను విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీఐలు

పోలీసు పీజీఆర్ఎస్‌కు 104 ఫిర్యాదులు

జిల్లా ఎస్పీ కార్యాయంలో సోమవారం నిర్వహించిన పోలీసు పీజీఆర్ఎస్‌కు 104 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. తొమ్మిది మంది సీఐల వద్దకు ఫిర్యాదుదారులు వెళ్లి సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. అక్కడ నుంచి ఎస్పీ వద్దకు వెళ్లారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, సీఐలు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా మలేరియా వ్యాధిని నిర్మూలించవచ్చునని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టర్‌లో సోమవారం ప్రపంచ మలేరియా దినోత్సవం పోస్టర్లు, బ్యానర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారమూ డ్రైడే పాటించి దోమలు వ్యాప్తి చెందకుండా, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్ల మలేరియా అధికారి రూప్‌కుమార్, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ పెండింగ్ పనులను వేగవంతం చేయాలి

వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నాయుడుపేట, మేనకూరు మండలాలకు సంబంధించిన ఏడు గ్రామాల్లో భూసేకరణ, రోడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయభరత్‌రెడ్డి పాల్గొన్నారు.



చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రవి నాయుడు, డీఎస్సీ అభ్యర్థులు

ఆరేళ్ల కల నిజమాయె

డీఎస్సీపై చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

తిరుపతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ అభ్యర్థుల ఆరేళ్ల కలను సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి లోకేశ్ సాకారం చేశారని శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీని విడుదల చేసి ఇది మంచి ప్రభుత్వమని మరోసారి నిరూపించుకుందన్నారు. డీఎస్సీ విడుదల సందర్భంగా తిరుపతి ఆర్డీవో ఆఫీసు ఎదుట డీఎస్సీ అభ్యర్థులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో కలిసి సోమవారం చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. 'థ్యాంక్యూ సీఎం సర్, లోకేశ్ అన్న' అంటూ డీఎస్సీ అభ్యర్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. రవినాయుడు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఇదే ప్రాంతంలో నిరసనలు, ధర్నాలు చేపట్టామని, కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. అన్ని కేటగిరీలకు న్యాయం జరిగేలా ప్రస్తుత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ మాట్లాడుతూ డీఎస్సీ విడుదల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని, చెప్పినట్టుగానే 16,347 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారని అన్నారు. ఇప్పటికైనా మాజీ సీఎం జగన్ రెడ్డి బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, రాష్ట్ర సభ్యులు ఆర్కే నాయుడు, విష్ణు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

రుయాలో చికిత్స పొందుతున్న వెంకటేష్‌కు శాప్ ఛైర్మన్ పరామర్శ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలపై దాడులకు, హత్యాయత్నాలకు పాల్పడుతున్న వైసీపీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు కోరారు. వైసీపీ నేతల దాడిలో గాయపడి రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న 1వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్‌ను సోమవారం టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఏపీ యూఎఫ్ఐడీసీ ఛైర్మన్ వూకా విజయ్‌కుమార్‌తో కలిసి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభియన్ అండదండలతో వైసీపీ నేతలు దాడులకు, హత్యాయత్నాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని టీడీపీ నేతలను భయభ్రాంతులకు గురిచేయాలనే ఆలోచనతోనే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చిల్లర రాజకీయాలు ఎన్ని చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. వైసీపీ దాడులకు, బెదిరింపులకు టీడీపీ నేతలు భయపడరని స్పష్టం చేశారు. నరసింహయాదవ్, మునికృష్ణ మాట్లాడుతూ ప్రశాంతమైన తిరుపతిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రుయాకు చేరుకొని వెంకటేష్‌ను పరామర్శించి భరోసా కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు శంకర నారాయణ పాల్గొన్నారు.



వెంకటేష్‌ను పరామర్శిస్తున్న రవినాయుడు, టీడీపీ నేతలు

ఉపాధ్యాయులకు ప్రత్యేక మెడికల్ క్యాంపు

తిరుపతి(విద్య), ఏప్రిలల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలోని ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రత్యేక మెడికల్ క్యాంపును తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ తెలిపారు. స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్ట్ 2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్స్ పొందాల్సిన ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా మెడికల్ క్యాంపునకు హాజరుకావాలని సూచించారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు రుయా ఆసుపత్రిలో పాత ఆరోగ్య సర్టిఫికెట్లను చూపించి, సంబంధిత వైద్యులతో పరిశీలన చేయించుకుని కొత్త సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. వీటి ఆధారంగానే బదిలీల్లో ప్రిఫరెన్షియల్, స్పెషల్ పాయింట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు.

వాచీల ఈ-వేలం

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలను మే 1, 2 తేదీల్లో ఈ-వేలం నిర్వహించనున్నారు. టైటాన్, సిటిజన్, సొనాట, రాగా, టైమ్స్, టైమెక్స్ ఇతర కంపెనీల స్మార్ట్ వాచీలు 62 లాట్లు కొత్తవి, ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్నవి ఉన్నాయి. ఇతర వివరాలకు తిరుపతిలోని మార్కెటింగ్ కార్యాలయం 0877- 2264429, టీటీడీ వెబ్‌సైట్, రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్‌ను సంప్రదించాలని టీటీడీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.